

విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

అన్ని వర్గాల మద్దతుతోనే గెలిచా: కొండా

● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నేతలు

సరూర్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీగా విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బుధవారం ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల కమిటీ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు బొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ అన్నివర్గాల మద్దతుతోనే తాను ఘన విజయం సాధించగలిగానని అన్నారు. తనకు అందరూ సమానమేనని, ఇక ముందు కూడా అందరినీ కలుపుకుని పోతానని ఆయన పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేస్తానని, ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయబోనని కొండా స్పష్టం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ముచ్చర్ల ఆనంద్‌మాదిగ, బొర్ర రవిమాదిగ, డీకే నర్సింహమాదిగ, అంజయ్యమాదిగ, తొట్ల శ్రీనివాస్‌మాదిగ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

ఈటలకు భారీ మెజార్టీ అందించిన ఎల్బీనగర్ ప్రజలకు ధన్యవాదాలు: సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌కు భారీ మెజార్టీ అందించిన ఎల్బీనగర్ ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. ఎల్బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో మూడవసారి ప్రధానమంత్రి పదవిని చేపట్టనున్న నరేంద్ర మోదీ దేశాన్ని మరింత సుస్థిరం వైపు నడిపించి యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తారన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరితో పాటు సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈటల విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, నాయకులు ఠాకూర్ అశ్వినిసింగ్, తోట మహేందర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గానగంధర్వుడు బాలు జయంతి

ఎల్బీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను బుధవారం ఎల్బీనగర్ చిత్రాలేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీబీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో స్వరనీరాజనం నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు బాలు పాటలను ఆలపించి విద్యార్థులను, ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో ఎస్పీబీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శృంగారం గోవింద్ ఆచార్య, చెన్నా హరే రాము, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్, కమిటీ సభ్యులు కృష్ణవేణి, శ్రీనివాస్, రావూరి మాధవి, శ్రీదేవి, బ్లిస్ శ్రీనివాస్, కిషోర్‌దాస్, వినోద్ నువ్వుల, శివకుమార్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో దారిదోపిడీ

సైదాబాద్: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను గుర్తు తెలియని యువకులు అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసి ఇవ్వకపోవడంతో బైక్ గుంజుకుని పారిపోయారు. ఈ సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీకి చెందిన బీబీఏ విద్యార్థి సయ్యద్ ఇస్మాయిల్ మలక్‌పేట నూర్ మసీదు వద్ద ఉన్న పెద్దమ్మ ఇల్లు ఖాళీ చేస్తున్న కారణంగా సహాయం చేసేందుకు వచ్చాడు. సోదరుడు సోహెల్ షేక్(19)తో బుధవారం తెల్లవారుజామున పల్సర్ బైక్‌లో పెట్రోల్ పోసుకునేందుకు బయలుదేరాడు. కానీ ఆ సమయంలో పెట్రోల్ బంకులు మూసి ఉన్నాయి. సింగరేణి కాలనీలో విడిగా పెట్రోల్ అమ్ముతున్నారన్న సమాచారం మేరకు వెళ్తుండగా మార్గమధ్యలో సుమారు 20సంవత్సరాల వయస్సు గల ఇద్దరు గుర్తు తెలియని యువకులు వచ్చి బైక్‌ను అడ్డగించారు. రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేయగా విద్యార్థులు నిరాకరించారు. దీంతో విద్యార్థులపై దాడి చేసి బలవంతంగా బైక్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సౌరశక్తిని ప్రోత్సహిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

● అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్



రోజా మహిళా పొదుపు సంఘం ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న వాణీప్రసాద్

హైదరాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సౌరశక్తి(సోలార్ పవర్)ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాణీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, భూ వినియోగ మార్పులు, నీటి వనరుల పర్యవేక్షణకు రిమోట్ సెన్సింగ్‌తో పాటు జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సాంకేతికతను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన రీతిలో నిర్వహించి కాలుష్య నివారణకు సహకరించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. చెట్ల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వివిధ పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థల, పొదుపు సంఘాల ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఔరంగాబాద్‌లో ఓటమితో లోకసభలో మజ్లిస్‌కు మళ్లీ ఒకే ఒక్కడు..!

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గత లోకసభలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(మజ్లిస్) పార్టీకి ఇద్దరు సభ్యులుండగా ఈసారి ఒకే ఒక్క సభ్యుడితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మజ్లిస్ మొట్టమొదటిసారి 1984 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు లోకసభ సభ్యుడిగా వరుసగా ఎన్నికయ్యారు. ఈసారి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో లోకసభకు ఎన్నికయ్యారు. కాగా, 2019లో మహారాష్ట్రలో జరిగిన రాజకీయ పరిణామాల్లో ఔరంగాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇంతియాజ్ జలీల్ విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టారు. దీంతో గత లోకసభలో మజ్లిస్‌కు ఇద్దరు సభ్యుల బలం ఉండేది. ఈ సారి ఔరంగాబాద్ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్‌జలీల్ శివసేన అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే, బీహార్‌లోని కిషన్‌గంజ్ సీటును కైవసం చేసుకునేందుకు మజ్లిస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఆ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సైతం రెండు దఫాలుగా బీహార్‌లో పర్యటించి కిషన్‌గంజ్‌లో అక్తరుల్ ఇమాన్‌ను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. మూడోస్థానానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో గతంలో లాగే మళ్లీ లోకసభలో మజ్లిస్ పార్టీ ప్రతినిధిగా అసదుద్దీన్ ఒవైసీ ఒక్కరే ప్రాతినిధ్యం వహించనున్నారు.

గోకుల్‌నగర్ దారులపై మురుగు సమస్య తీరేదెన్నడో?

● 20 ఏళ్లుగా సమస్యతో సతమతం

● పైప్‌లైన్‌ను మార్చితేనే పరిష్కారం



బుధవారం గోకుల్‌నగర్ దారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆ కాలనీలో రహదారిపై నిత్యం మురుగు పరుగు తీస్తూ ఉంటుంది. మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు లీకేజీ సమస్య తీవ్రంగా ఉన్నపుడు కాలనీవాసులు కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు విన్నవిస్తున్నారు. ఆయన జలమండలి అధికారులకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరడంతో జలమండలి సిబ్బంది రావడం తాత్కాలికంగా మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయే సిల్టు తొలగించడం, మరునాడే సమస్య పునావృతం కావడం జరుగుతోంది. ఇలా 20 ఏళ్లుగా నిత్యం మురుగు సమస్యతో సతమతమవుతున్నామని బుధవారం కాలనీవాసులు ఆంధ్రజ్యోతితో వాపోయారు. మురుగునీటి లీకేజీతో తాగునీరు తరచూ దుర్వాసన వస్తోందని కాలనీవాసులు తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్స్ పైనే ఇళ్లు

గోకుల్‌నగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్ ప్రహరీ పక్కనే డ్రైనేజీ పైప్‌లైన్స్ పైనే కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో సమస్యను పరిష్కరించేందుకు చేపట్టాల్సిన పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. తొలుత ఆయా ఇళ్ల వారిని సంప్రదించాల్సి ఉంది. సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణాన్ని కొనసాగించాలన్నా ప్రస్తుతం వీలుకాని పరిస్థితి. ఈ కాలనీలో దాదాపు అన్ని దారులకూ డెడ్‌ఎండ్ స్థితిలో ఉన్నాయి.

శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



గోకుల్‌నగర్‌లో నిత్యం మురుగు సమస్యతో వేగలేకపోతున్నాం. సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన సాంకేతిక పరిశీలన చేపట్టాలి. సమస్య శాశ్వత పరిష్కారానికి అపార్టుమెంట్ల వారూ సహకరించాలి. జలమండలి సరఫరా చేస్తున్న తాగునీరు కూడా డ్రైనేజీ లీకేజీతో కలుషితమవుతుంది.

- ఎస్ లావణ్య, గృహిణి

వర్షాల వేళ సమస్య ఉధృతం



వర్షాల వేళ సమస్య ఉధృతంగా ఉంటుంది. భారీ వర్షాలు కురిస్తే తీవ్ర అసౌకర్యానికి గురిచేసేది. ఇళ్లలోకి వరదనీరు, మురుగునీరు చేరేది. కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలి. మురుగు సమస్యను శాస్వతంగా పరిష్కరించాలి.

- సందీప్, కాలనీవాసి

ఇటీవలే రెండుసార్లు సమస్యను పరిశీలించా

ఇటీవలే రెండుసార్లు సమస్యను పరిశీలించాను. సమస్య శాస్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జలమండలి జీఎం బలరామరాజు, డీజీఎం శ్రీనివాస్‌లతో కలిసి సమస్య పరిశీలించి, చర్చించాను. చాలా ఏళ్ల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మించారు. ఎక్కువ సామర్థ్యం గల నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- పవన్‌కుమార్, కార్పొరేటర్

ప్రస్తుతానికి తాత్కాలిక పరిష్కారం మాత్రమే

గోకుల్‌నగర్ మ్యాన్‌హోల్స్‌లో సిల్టు తొలగిస్తూ ప్రస్తుతానికి తాత్కాలిక పరిష్కారం మాత్రమే సాధ్యం. డ్రైనేజీ లీకేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులూ కాలనీని సందర్శించి, పరిశీలించారు. పాత పైప్‌లైన్లనూ మార్చేందుకు, తగిన చర్యలపై అవసరమైతే జీహెచ్ఎంసీ విభాగాల అధికారులనూ సంప్రదిస్తాం. డెడ్‌ఎండ్ దారులతో ఈ కాలనీ పైప్‌లైన్లను ఇతర కాలనీల పైప్‌లైన్లకు అనుసంధానం చేయడం వీలుకాదు.

- రామకృష్ణ, ఏఈ జలమండలి

ప్రకృతిని ప్రేమించి పర్యావరణాన్ని కాపాడండి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి



మొక్కనాటి నీరు పోస్తున్న ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ప్రేమించి పర్యావరణాన్ని కాపాడండి అని రంగారెడ్డి జిల్లా కోర్టుల జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది మన సమాజానికి అత్యంత అవసరమన్నారు. విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణంలో మార్పు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. పర్యావరణాన్ని రక్షించడం అనేది మనందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పునర్వినియోగం పెంపొందించడం, జలవనరులను సరిగ్గా వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు మాట్లాడుతూ మానవుడు తన మేధోసంపత్తితో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమలను నెలకొల్పుతున్నాడన్నారు. ఆ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో పర్యావరణం కోలుకోలేనంతగా కలుషితమై పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం అన్ని కలుషితమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జడ్జిలు, ఇతర ప్రముఖులు మొక్కలు నాటారు. రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు, కక్షిదారులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

వనస్థలిపురం: వాతావరణంలో వస్తున్న పెనుమార్పులను తగ్గించుకోవాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్‌లో దుష్ఫలితాలు సంభవించి మానవ మనుగడకే పెను ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి వాటిని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పీ.నరింహారావు, జిల్లా అధ్యక్షులు మాధవరావు, రామిరెడ్డి, రాంప్రసాద్, కృష్ణారెడ్డి, అశోక్‌రాజు, సాంబశివరావు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణాదిశేషు పాల్గొన్నారు.

పంచభూతాలను పరిరక్షించుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్: పంచభూతాలను పరిరక్షించుకున్నప్పుడే మానవ మనుగడ సాధ్యం అవుతుందని గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని గాంధీయన్ బీఈడీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి రాజేందర్‌రెడ్డి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం మానుకోవాలన్నారు. అదేవిధంగా మొక్కలను నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి. సురేందర్, గాంధీయన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరాలు-పర్యావరణంపై అధ్యయనం..!

● ప్లానింగ్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

హైదరాబాద్ సిటీ: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్లానింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో 2024కుగాను నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి చైర్మన్, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో 'నగరాలు- పర్యావరణం' అనే థీమ్‌తో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దేశంలోని ఏదైనా నగరంలో(నీళ్లు, వాతావరణం, ఎనర్జీ, వెజిటేషన్ తదితర సబ్ థీమ్‌లపై) అధ్యయనం చేసి శాస్త్రీయ విధానంలో పేపర్, పోస్టర్ సమర్పించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. త్రిస్సూరు నగరంపై కోల్‌కతా ఎన్ఐటీకి చెందిన విద్యార్థులు అర్షియా, అనుశ్రీ, ఆదర్శ్ అధ్యయనం చేసి 'కర్బన ఉద్గారాలు- ప్రభావాల అంచనా'పై సమర్పించిన పేపర్‌కు ప్రథమ, 'బెంగళూరులో నీటి సంక్షోభం-వ్యూహాత్మక విధానాల విశ్లేషణ'పై హైదరాబాద్ జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు గాజుల అంజలి, మేగరాజ్ ధనుంజయ్, అభినయ్‌ఇంద్రాణి పేపర్‌కు ద్వితీయ, 'నీటి లభ్యత-సామాజిక, పర్యావరణ ప్రభావాలు' అంశంపై చెన్నైలో అవలంబిస్తోన్న విధానాలపైన ఎస్‌పీఏ ఢిల్లీకి చెందిన విద్యార్థులు కలంగుట్కర చిన్మయి, దేవేష్ పట్వారిబ్, ధనుష్‌కుమార్ సమర్పించిన పేపర్‌కు తృతీయ బహుమతి లభించింది. సెమినార్‌లో వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్ డైరెక్టర్ అనంత్ మరిగంటి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంటకోటోలు దేవేందర్‌రెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు.

న్యాయ పట్టభద్రులకు ఉచిత శిక్షణ

● రేపటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయ పట్టభద్రులకు మూడేళ్లపాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందేవారికి నెలకు రూ.3 వేల స్టయిఫండ్, రూ.50 వేల డిజిటల్ బుక్స్, ఫర్నిచర్, కంప్యూటర్, డ్రెస్ ఇస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకునేందుకు ఫీజు కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 7 నుంచి జూలై 6వ తేదీలోప్ప్టఢ్ఞఇౠఋఙఙౠౌ.జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ కలహాలతో నవవధువు అదృశ్యం

సైదాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ నవ వధువు ఇంటి నుంచి వెళ్లిపోయింది, ఈ ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖాజాబాగ్‌లో నివాసముండే ప్రైవేటు ఉద్యోగి ముదావత్ సంతోష్(24), నేనావత్ అనిత(18)తో ఏప్రిల్ 24న వివాహం జరిగింది. వీరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సంతోష్ ఉద్యోగానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య కనిపించలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి

● రైల్లో రవాణా

● స్మగ్లర్ అరెస్ట్, 22కేజీల గంజాయి స్వాధీనం



అరెస్టయిన స్మగ్లర్, స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బ్యాగ్‌లలో గంజాయి నింపుకొని ఒడిశా నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల కళ్లుగప్పి సరుకును సరఫరా చేయాలని చూసిన ఘరానా స్మగ్లర్‌ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్‌న్యూ) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ. 5.55 లక్షల విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్స్ మాదకద్రవ్యాలను గుట్టుగా నగరానికి తెస్తున్నారు. ఇదే క్రమంలో ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురేష్ షైక్ అలియాస్ కురేష్‌కు నగరంలోని గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఉంది. అతడి ఆదేశాల మేరకు కురేష్ 22 కేజీల గంజాయిని బ్యాగ్‌లలో నింపుకొని రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి రిసీవర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అతడికి సరుకు అందజేసి, డబ్బు తీసుకొని వెంటనే వెళ్లిపోవడానికి వేచి చూస్తున్నాడు. ఇంతలోనే విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డానియేల్ బృందాలు రంగంలోకి దిగాయి. మార్కెట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి కురేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిలో మాణిక్యాలు ఈ అడవి బిడ్డలు

● నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు



ప్రభాస్



శిరీష



పునెం అక్షిత్‌దొర



శైలజ

హయత్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే ఏదైన సాధించవచ్చు అని నిరూపిస్తున్నారు ఈ అడవి బిడ్డలు. మట్టిలో మాణిక్యాలుగా వెలుగొందుతూ తన తెగకు తగిన గౌరవాన్ని తీసుకువస్తున్నారు. తెలంగాణ ఆదిమ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాల విద్యార్థులు మంగళవారం తెలువడిన నీట్ పరీక్ష ఫలితాలలో 50మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రికార్డు సృష్టించారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆదిమ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలలో చదువుకుంటూ చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. నల్లగొండ జిల్లా చెర్లగూడెం బీమనపల్లి చెంచుతెగకు చెందిన మేకల ప్రభాస్ నీట్ ఫలితాల్లో 509/720 (జాతీయ స్థాయిలో 2617 ర్యాంకు)మార్కులు సాధించాడు. ఈ తెగ నుంచి తొలిసారిగా డాక్టర్ కాబోతున్నాడు. కన్నెపల్లి మంచిర్యాల కొలవారు తెగకు చెందిన మన్నెపల్లి శిరీష 469/720 (జాతీయ స్థాయిలో 4347 ర్యాంకు), ములుగు జిల్లా బొదపురం కోయ తెగకు చెందిన పునం అక్షిత్‌దొర 578/720 (జాతీయ స్థాయిలో 858 ర్యాంకు) కుమరం భీం జిల్లా లంబర్తి చింతమానెపల్లి లంబాడకు చెందిన అజ్మీరా శైలజ 580/720 (జాతీయ స్థాయిలో 820 ర్యాంకు) మహబూబ్‌బాద్ కేసముద్రం లంబాడ తెగకు చెందిన బొడ అమూల్య 539/720 (జాతీయ స్థాయిలో 1680 ర్యాంకు) సాధించారు. వీరితో పాటు మరో 45మంది విద్యార్థులు వివిధ ర్యాంకులు సాధించారు. వైద్య కోర్సు చదవడానికి అర్హత సాధించారు. 2023- 2024 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ ఆదిమ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలలో లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకున్న 100 మంది విద్యార్థుల్లో 50 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ కేశవులు, నీట్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డిలు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

టీడీపీ కూటమి ప్రభంజనం దేశానికే గర్వకారణం

● ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌చౌదరి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న సతీష్‌చౌదరి తదితరులు

వనస్థలిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో తెలుగుదేశం కూటమి ప్రభంజనం సృష్టించడం దేశానికే గర్వకారణమని ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప సతీష్ చౌదరి హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప సతీష్ చౌదరి ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సతీష్ చౌదరి మాట్లాడుతూ ఏపీలోని అరాచక, నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడి వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడంతో ఎన్టీఆర్ ఆత్మ ఎంతగానో సంతోషిస్తుందన్నారు. నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించడం ఖాయమన్నారు. అనంతరం రంగులు చల్లుకుని, టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రతినిధులు గోవర్ధన్‌చౌదరి, రాజయాదవ్, మురళీ యాదవ్, శ్రీనివాస్, రామచౌదరి, బాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కోటయ్యచౌదరి, గోపి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలంటూ మీర్‌పేట్ పీఎస్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన



మీర్‌పేట్ పీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

సరూర్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడలోని వినాయకహిల్స్‌లో మంగళవారం జరిగిన మహిళ హత్య కేసులో నలుగురు నిందితులు ఉండగా, పోలీసులు కేవలం ఒకరిపైనే కేసు నమోదు చేశారని, నిందితులందరిపైనా కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కుటుంబ కలహాల నేపథ్యం లో జటావత్ ప్రభు మంగళవారం తన అల్లుడి తల్లి(వియ్యంకురాలి)పై సుత్తితో దాడి చేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ సంఘటనలో ఆయనతో పాటు ఆయన భార్య, కూతురు సైతం పాల్గొన్నారని, శ్రీనివాస్ అనే మరో వ్యక్తి కీలక పాత్ర పోషించాడని మృతురాలు లలిత కుమారుడు జయరామ్ ఆరోపించారు. వెంటనే సదరు నిందితులందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జయరామ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కాగా పోలీసులు నిందితులను అరెస్టు చేస్తామని ఆందోళనకారులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.

స్టాక్‌మార్కెట్ ఐపీవో పేరుతో మోసం.. లోన్ ఇప్పించి.. రూ.34.90 లక్షలు కొట్టేశారు

● వాట్సాప్‌లో మెసేజ్.. '657 ఐసెకన్' పేరుతో గ్రూప్

● ప్రత్యేక యాప్‌తో బురిడీ.. నిలువునా ముంచిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపీవో)లో పెట్టుబడి పేరుతో.. సైబర్ కేటుగాళ్లు రుణం ఇప్పించి మరీ ఓ బాధితుడి నుంచి రూ.34.90 లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన సదరు బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు వాట్సాప్‌లో స్టాక్‌మార్కెట్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. '657 ఐసెకన్' అనే వాట్సాప్ గ్రూపులో అతడు యాడ్ అయ్యాడు. ఆ గ్రూప్‌లో 140 మంది సభ్యులున్నారు. వారంతా రోజువారీ వ్యూహాలు.. లాభాల గురించి చర్చించుకుంటున్నారు. గ్రూప్ అడ్మిన్ నుంచి 'ఇంకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోనివాళ్లు కింది లింక్ ద్వారా వివరాలను పంపొచ్చు' అనే సందేశాన్ని పోస్ట్ చేశాడు. దానికి బాధితుడు స్పందించడంతో.. వ్యక్తిగత వివరాలను సేకరించి, అతడితో ఫేక్ బ్రోకరేజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో ట్రేడింగ్ చేసే సదుపాయం కల్పించారు. శివం కెమికల్స్ అనే కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్స్(ఐపీవో)లో పెట్టుబడులు పెట్టాలంటూ యాప్ ప్రతినిధుల పేరుతో బాధితుడికి ఫోన్లు వచ్చాయి. బాధితుడు దానికి ఒప్పుకోకపోవడంతో.. సెబీ నుంచి భారీ పెనాల్టీ పడుతుందని హెచ్చరించారు. "నా దగ్గర డబ్బుల్లేవు" అని చెబితే.. బజాజ్ క్యాపిటల్ నుంచి భారీగా లోన్ ఇప్పించి, ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు కూడా భారీగా వచ్చినట్లు యాప్‌లో కనిపించడంతో.. బాధితుడు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా.. ఆ ఆప్షన్ కనిపించలేదు. యాప్ ప్రతినిధులకు కాల్ చేసినా.. స్పందన లేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.